PRGI REGN NO: APTEL/26/A3695

నేటి మినిట్ టు మినిట్

తెలుగు దిన పత్రిక

NETI MINUTE TO MINUTE


TELUGU DAILY

సంపుటి: 01 సంచిక :147 ఎడిషన్ : అనంతపురము మరియు సత్యసాయి జిల్లా, తేది : గురువారం -12 నవంబర్ 2026, పేజీలు -4 వెల 1/-

VOLUME:01 ISSUE:147 EDITION: ANANTHAPURAMU, SATHYA SAI DIST. DATE: THURSDAY 12 NOVEMBER 2026 PAGES: 04 RS:01/

నీటి వినియోగంపై కొత్త నియంత్రణలు!

వాటర్ రెగ్యులేటరీ కమిషన్ ఏర్పాటుకు సీఎం చంద్రబాబు ఆదేశాలు.. విద్యుత్ రంగంలోని ఏపీఈఆర్‌సీ తరహాలో విధులు



అమరావతి,నవంబర్ 11(నేటి మినిట్ టు మినిట్): రాష్ట్రంలో సాగునీటి వినియోగాన్ని నియంత్రించేందుకు వాటర్ రెగ్యులేటరీ కమిషన్ ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అధికారులను ఆదేశించారు. విద్యుత్ రంగంలో పనిచేస్తున్న ఏపీఈఆర్‌సీ తరహాలోనే జలవనరుల రంగంలోనూ ప్రత్యేక నియంత్రణ వ్యవస్థను ఏర్పాటు చేయాలని సూచించారు. బుధవారం క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన ఉన్నతస్థాయి సమీక్షా సమావేశంలో ఈ నిర్ణయం తీసుకున్నారు. ఈ కమిషన్ నీటి వినియోగంపై నిర్ణయాలు తీసుకుంటుందని సీఎం తెలిపారు. గతంలో గ్రామాల్లో నీటి మీటర్ల ఏర్పాటుకు సంబంధించి ప్రభుత్వం జారీ చేసిన జీవోపై విమర్శలు వచ్చిన నేపథ్యంలో, తాజాగా వాటర్ రెగ్యులేటరీ కమిషన్ ఏర్పాటు ప్రతిపాదన ప్రాధాన్యత సంతరించుకుంది. కమిషన్ అమల్లోకి వస్తే సాగునీటి మీటర్లు, వినియోగదారులపై ఛార్జీల విధింపు వంటి అంశాలు తెరపైకి వచ్చే అవకాశం ఉందనే అభిప్రాయాలు

మిగతా2లో...

స్వచ్ఛ సర్వేక్షణ్‌లో ఏపీకి ఆరు జాతీయ అవార్డులు

- విశాఖ, విజయవాడ, గుంటూరు, తిరుపతి, రాజమహేంద్రవరం, కుప్పం పట్టణాలకు గుర్తింపు



అమరావతి,నవంబర్ 11(నేటి మినిట్ టు మినిట్): స్వచ్ఛ సర్వేక్షణ్ 202526 జాతీయ పురస్కారాల్లో ఆంధ్రప్రదేశ్ ఆరు అవార్డులను సాధించింది. రాష్ట్రంలోని ఐదు నగరపాలక సంస్థలు, ఒక మున్సిపాలిటీకి ఈ గుర్తింపు లభించింది. ఢిల్లీలోని విజ్ఞాన్ భవన్‌లో బుధవారం జరిగిన కార్యక్రమంలో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము విజేతలకు పురస్కారాలు

మిగతా2లో...



సోనియా, రాహుల్‌తో వైఎస్ షర్మిల భేటీ

- ఢిల్లీలో కాంగ్రెస్ అగ్రనేతలతో సమావేశం.. కుమార్తె వివాహానికి రాహుల్‌కు ఆహ్వానం

న్యూఢిల్లీ,11(నేటి మినిట్ టు మినిట్): ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల బుధవారం

మిగతా2లో...

విద్య, డిజిటల్ పాలనలో సింగపూర్‌తో ఏపీ భాగస్వామ్యం

ఉపాధ్యాయులు, మంత్రులు, అధికారులకు శిక్షణ కార్యక్రమాల విస్తరణకు నారా లోకేశ్ ప్రతిపాదన



అమరావతి,నవంబర్ 11(నేటి మినిట్ టు మినిట్): ఆంధ్రప్రదేశ్‌లో విద్యా ప్రమాణాలను మెరుగుపరచడంతోపాటు డిజిటల్ పాలనను బలోపేతం చేసేందుకు సింగపూర్‌తో సహకారాన్ని మరింత విస్తరించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఇందులో భాగంగా ఉపాధ్యాయులు, మంత్రులు, ఉన్నతాధికారులకు సింగపూర్ సహకారంతో శిక్షణ కార్యక్రమాలు

మిగతా2లో...

రేపు ఏపీ పంచాయతీ ఎన్నికల షెడ్యూల్ విడుదల

- మూడు విడతల్లో ఎన్నికలు.. నవంబర్ 26, 29, డిసెంబర్ 2న పోలింగ్



విశాఖలో నేటి నుంచి సీఐఐ భాగస్వామ్య సదస్సు

58 దేశాల నుంచి 3,800 మంది ప్రతినిధులు.. రూ.11 లక్షల కోట్ల పెట్టుబడులే లక్ష్యం.. 2.5 లక్షల ఉద్యోగాల కల్పనపై ఆశలు



విశాఖపట్నం,నవంబర్ 11(నేటి మినిట్ టు మినిట్): ఆంధ్రప్రదేశ్‌లో భారీ పెట్టుబడులు, అంతర్జాతీయ వ్యాపార భాగస్వామ్యాలే లక్ష్యంగా 31వ సీఐఐ భాగస్వామ్య సదస్సు గురువారం నుంచి విశాఖపట్నంలో ప్రారంభం కానుంది. రెండు రోజులపాటు జరిగే ఈ సదస్సుకు దాదాపు 58 దేశాల నుంచి 3,800 మంది ప్రతినిధులు హాజరుకానున్నారు. విదేశీ మంత్రులు, రాయబారులు, అంతర్జాతీయ పారిశ్రామికవేత్తలు, పెట్టుబడిదారులు ఇందులో పాల్గొననున్నారు. 'మారుతున్న ప్రపంచ వ్యవస్థలో వాణిజ్యం, సాంకేతికత, విశ్వాసం, నాయకత్వం' అనే ఇతివృత్తంతో ఈ సదస్సును నిర్వహిస్తున్నారు. సుమారు రూ.11 లక్షల కోట్ల పెట్టుబడులకు సంబంధించిన ఒప్పందాలు కుదిరే అవకాశం ఉందని, తద్వారా 2.5 లక్షల మందికి ఉపాధి లభిస్తుందని ప్రభుత్వం అంచనా వేస్తోంది. కేంద్ర వాణిజ్య, మిగతా2లో...

హైదరాబాద్‌కు పూర్వ వైభవం

చెరువుల నగరంగా హైదరాబాద్ పాత గుర్తింపును పునరుద్ధరిస్తాం.. భవిష్యత్ తరాల కోసం జలవనరుల పరిరక్షణ: సీఎం రేవంత్‌రెడ్డి





కొత్త పార్టీ ప్రకటించిన విజయసాయిరెడ్డి

- 'పరివర్తన రాజనీతి పార్టీ' పేరుతో రాజకీయ ప్రస్థానం.. విజయవాడలో పార్టీ జెండా ఆవిష్కరణ

కూటమి అక్రమాలను ప్రజలు గమనించారు

నామినేషన్ల నుంచి ఓట్ల లెక్కింపు వరకు దాడులు, దౌర్జన్యాలు

రిగ్గింగ్ మాస్టర్ చంద్రబాబు: జగన్ విమర్శలు



అమరావతి,నవంబర్ 11(నేటి మినిట్ టు మినిట్): స్థానిక సంస్థల ఎన్నికల్లో ముఖ్యమంత్రి ప్రభుత్వం పాల్పడిన అక్రమాలను ప్రజలంతా ప్రత్యక్షంగా చూశారని వైసీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. ఎన్నికల ప్రక్రియలో నామినేషన్ల దశ నుంచి ఓట్ల లెక్కింపు వరకు అడుగడుగునా దాడులు, దౌర్జన్యాలు చోటుచేసుకున్నాయని ఆరోపించారు. అధికార కూటమి ఎన్ని అక్రమాలకు పాల్పడినా వైసీపీ కార్యకర్తలు పట్టుదలతో పనిచేశారని తెలిపారు. మిగతా2లో...

నీటి వినియోగంపై కొత్త నియంత్రణలు!

(మొదటి పేజీ తరువాయి)

వ్యక్తమవుతున్నాయి. **ఎత్తిపోతల పథకాల పునరుద్ధరణకు రూ.632 కోట్లు** వైసీపీ ప్రభుత్వ నిర్లక్ష్యంతో నిర్వీర్యమైన ఎత్తిపోతల పథకాలను పూర్తిస్థాయిలో పునరుద్ధరించి, వచ్చే జూన్ నాటికి వాటి ద్వారా నీటిని విడుదల చేసేలా చర్యలు చేపట్టాలని సీఎం ఆదేశించారు. క్షేత్రస్థాయిలో పథకాల పరిస్థితిని పరిశీలించి వెంటనే టెండర్లు పిలిచి పనులు ప్రారంభించాలని సూచించారు. పర్యవేక్షణ బాధ్యతను జలహారతి కార్పొరేషన్‌కు అప్పగించాలని, అవసరమైతే ప్రతి జిల్లాకు చీఫ్ ఇంజినీర్ లేదా సూపరింటెండింగ్ ఇంజినీర్‌ను నియమించాలని తెలిపారు. **సౌర విద్యుత్ ఉత్పత్తిపై దృష్టి** జలవనరుల శాఖ పరిధిలోని 5,565 ఎకరాల భూమిలో 4,061 ఎకరాలను సౌర విద్యుత్ ప్లాంట్ల ఏర్పాటుకు గుర్తించినట్లు అధికారులు సీఎంకు వివరించారు. వీటి ద్వారా 877.3 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి చేయవచ్చని తెలిపారు. ఇరిగేషన్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ పరిధిలో మరో 110 ఎకరాలను వినియోగించి 25.8 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తికి అవకాశం ఉందన్నారు. మొత్తంగా 4,171 ఎకరాల ద్వారా 903.1 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి చేయవచ్చని వెల్లడించారు. కాలువలపై కూడా సౌర, జలవిద్యుత్ ఉత్పత్తి అవకాశాలను పరిశీలించాలని సీఎం సూచించారు. రాష్ట్రంలో ప్రాధాన్యతగా చేపట్టిన 36 సాగునీటి ప్రాజెక్టులను వచ్చే రెండున్నరేళ్లలో పూర్తి చేయాలని, అవసరమైన నిధులను విడుదల చేసేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని చంద్రబాబు తెలిపారు.

విద్య, డిజిటల్ పాలనలో సింగపూర్‌తో ఏపీ భాగస్వామ్యం

(మొదటి పేజీ తరువాయి)

నిర్వహించాలని రాష్ట్ర విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేశ్ ప్రతిపాదించారు. అమరావతిలోని ఏపీసీఆర్డీఏ కార్యాలయంలో బుధవారం జరిగిన ఆంధ్రప్రదేశ్‌సింగపూర్ సంయుక్త అమలు కమిటీ (జేఐఎస్‌సీ) మూడో సమావేశానికి నారా లోకేశ్, సింగపూర్ విదేశీ వ్యవహారాలు, ఇంధనం, వాణిజ్య, పరిశ్రమల శాఖ సహాయ మంత్రి గన్ సియో హువాంగ్ సంయుక్తంగా అధ్యక్షత వహించారు. ఇరు ప్రభుత్వాల మధ్య కుదిరిన అవగాహన ఒప్పందం అమలు పురోగతిని సమీక్షించి, తదుపరి కార్యాచరణపై చర్చించారు. **ఉత్తమ ఉపాధ్యాయులకు సింగపూర్‌లో శిక్షణ** ఇప్పటికే ఆంధ్రప్రదేశ్‌కు చెందిన ఆరుగురు మంత్రులు, 37 మంది ఉపాధ్యాయులకు సింగపూర్‌లో శిక్షణ అందించినందుకు నారా లోకేశ్ ఆ దేశ ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్రంలో ప్రతిభ కనబరిచిన ఉత్తమ ఉపాధ్యాయులను వేసవి సెలవుల్లో సింగపూర్‌కు పంపించి అంతర్జాతీయ స్థాయి బోధనా పద్ధతులపై శిక్షణ ఇప్పించాలని ప్రతిపాదించారు. అక్కడ శిక్షణ పొందిన ఉపాధ్యాయులు తమ అనుభవాలను ఇతర ఉపాధ్యాయులతో పంచుకునేలా పాఠశాల సముదాయ సమావేశాలను వేదికగా ఉపయోగించుకోవాలని సూచించారు. విద్యాశాఖలో మార్గదర్శకత్వం, దిశానిర్దేశం, పరిపాలన అనే మూడు అంశాలపై సామర్థ్య పెంపు కార్యక్రమాలు చేపట్టాలని మంత్రి పేర్కొన్నారు. విధానాల రూపకల్పన, వాటి అమలులో సమన్వయం పెంచేందుకు సింగపూర్‌ఆంధ్రప్రదేశ్ గవర్నెన్స్ ఎక్సలెన్స్ (సేజ్) కార్యక్రమం కింద మంత్రులు, ఆయా శాఖల కార్యదర్శులకు ఉమ్మడి శిక్షణ ఇవ్వాలని ప్రతిపాదించారు. **డిజిటల్ పాలనలో సింగపూర్ అనుభవం** డిజిటల్ పరివర్తన, సమీకృత డిజిటల్ వేదికలు, కమాండ్ కంట్రోల్ కేంద్రాలు, సమాచార ఆధారిత నిర్ణయాల అమలులో సింగపూర్ అనుభవాన్ని వినియోగించుకోవాలని నారా లోకేశ్ కోరారు. దీనివల్ల ప్రభుత్వ సేవలను ప్రజలకు మరింత వేగంగా, సమర్థవంతంగా అందించవచ్చని తెలిపారు. నైపుణ్యాభివృద్ధి, అధికారుల సామర్థ్య పెంపు, సాంకేతిక పరిజ్ఞాన వినియోగం వంటి రంగాల్లోనూ పరస్పర సహకారాన్ని పెంచుకోవాలని సూచించారు. ఇటీవల తుఫానుల ప్రభావంతో కొన్ని కార్యక్రమాల అమలులో జాప్యం జరిగినప్పటికీ, వాటిని వేగవంతం చేసేందుకు చర్యలు తీసుకుంటామని మంత్రి తెలిపారు. గత సమావేశాల్లో తీసుకున్న నిర్ణయాల అమలును ప్రతి ఆరు నెలలకోసారి సమీక్షించాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమాల పర్యవేక్షణకు ప్రత్యేక నోడల్ అధికారిని నియమించినట్లు అధికారులు వెల్లడించారు. సింగపూర్ ప్రతినిధి బృందంలో ఆ దేశ విదేశీ వ్యవహారాలు, వాణిజ్య, పరిశ్రమల శాఖల ప్రతినిధులు, సింగపూర్ కోఆపరేషన్ ఎంటర్‌ప్రైజ్, ఎంటర్‌ప్రైజ్ సింగపూర్ అధికారులు పాల్గొన్నారు.

విశాఖలో నేటి నుంచి సీఐఐ భాగస్వామ్య సదస్సు

(మొదటి పేజీ తరువాయి)

పరిశ్రమల శాఖ మంత్రి పీయూష్ గోయల్ సదస్సుకు అధ్యక్షత వహించనుండగా, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సహాధ్యక్షుడిగా వ్యవహరించనున్నారు. **అమిత్‌షా ప్రారంభోత్సవానికి హాజరు** గురువారం ఉదయం 9.30 గంటలకు ప్రారంభ కార్యక్రమం జరగనుంది. కేంద్ర హోంమంత్రి అమిత్‌షా ఉదయం 10.30 గంటలకు ప్రారంభ సమావేశంలో పాల్గొంటారు. ఉపరాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్ నవంబర్ 13న జరిగే ముగింపు కార్యక్రమానికి హాజరుకానున్నారు. రాష్ట్ర గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్, ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు కూడా పాల్గొంటారు.సింగపూర్, యూఏఈ, జపాన్, రష్యా, స్లోవాక్ రిపబ్లిక్ తదితర దేశాల ప్రతినిధులు ఈ సదస్సులో భాగస్వాములు కానున్నారు. 16 మంది విదేశీ మంత్రులు, 40 మంది అంతర్జాతీయ స్థాయి ప్రతినిధులు హాజరవుతారని అంచనా. **400కు పైగా వ్యాపార సమావేశాలు**సదస్సులో భాగంగా 400కు పైగా వ్యాపార సంస్థల మధ్య సమావేశాలు నిర్వహించనున్నారు. అంతర్జాతీయ వాణిజ్యం, పెట్టుబడులు, సెమీకండక్టర్లు, క్వాంటం సాంకేతికత, నూతన ఆవిష్కరణలు, నైపుణ్యాభివృద్ధి, స్వచ్ఛ ఇంధనం, వ్యవసాయం, ఆహార భద్రత తదితర అంశాలపై చర్చలు జరగనున్నాయి. ప్రపంచ ఆర్థిక వేదిక ఆధ్వర్యంలో భారత ఇంధన భవిష్యత్తుపై ప్రత్యేక సమావేశం నిర్వహించనున్నారు. మహిళల అభివృద్ధి, పారిశ్రామిక రంగంలో వారి భాగస్వామ్యంపై ప్రత్యేక సదస్సు కూడా జరగనుంది. **పెట్టుబడుల అమలుపై ప్రత్యేక దృష్టి** గతంలో కుదిరిన పెట్టుబడి ఒప్పందాల కార్యరూపం దాల్చేలా రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక పర్యవేక్షణ చేపట్టింది. ఇప్పటికే రూ.6 లక్షల కోట్ల విలువైన 272 ప్రాజెక్టులు కార్యకలాపాలు ప్రారంభించాయని, మరో రూ.17 లక్షల కోట్ల పెట్టుబడుల ప్రాజెక్టులకు అనుమతులు లభించాయని ప్రభుత్వం వెల్లడించింది.

గత ఆరు ప్రాంతీయ సదస్సుల్లో రూ.86,522 కోట్ల విలువైన 194 ఒప్పందాలు కుదిరాయని, వాటి ద్వారా సుమారు 1.4 లక్షల ఉద్యోగాలు కల్పించే అవకాశం ఉందని తెలిపింది.సదస్సులో కుదిరే ఒప్పందాలను పరిశ్రమల స్థాపన, ఉద్యోగాల కల్పన దిశగా తీసుకెళ్లడమే ప్రధాన లక్ష్యంగా ప్రభుత్వం కార్యాచరణ రూపొందిస్తోంది.

హైదరాబాద్‌కు పూర్వ వైభవం

హైదరాబాద్,నవంబర్ 11(నేటి మినిట్ టు మినిట్): హైదరాబాద్ నగరానికి చెరువుల నగరంగా ఉన్న పూర్వ వైభవాన్ని తిరిగి తీసుకురావడమే తన సంకల్పమని ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి తెలిపారు. నగరంలోని చెరువులను పునరుద్ధరించి భవిష్యత్ తరాలకు అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. మాదాపూర్‌లో పునరుద్ధరించిన తమ్మిడికుంట చెరువును బుధవారం ప్రారంభించనున్న సందర్భంగా ఆయన ఈ విషయాన్ని వెల్లడించారు.తమ్మిడికుంట చెరువును సుమారు 30 ఎకరాల విస్తీర్ణంలో అభివృద్ధి చేసినట్లు తెలిపారు. గతంలో ఆక్రమణలు, ఇతర కారణాలతో చెరువు విస్తీర్ణం తగ్గిపోయిందని, హైడ్రా ఆధ్వర్యంలో ఆక్రమణలను తొలగించి పూడికను తీసి పునరుద్ధరణ పనులు చేపట్టినట్లు పేర్కొన్నారు. చెరువు పరిసరాల్లో వాకింగ్ ట్రాక్, ఓపెన్ జిమ్, పిల్లల ఆట స్థలం, పచ్చదనం వంటి సదుపాయాలను ఏర్పాటు చేశారు. **ఇప్పటికే మూడు చెరువుల పునరుద్ధరణ**హైదరాబాద్‌లో ఇప్పటికే నల్లచెరువు, బతుకమ్మకుంట, బం-రుక్నుద్దౌలా చెరువులను పునరుద్ధరించి ప్రజలకు అందుబాటులోకి తీసుకొచ్చినట్లు సీఎం తెలిపారు. తమ్మిడికుంట నాలుగో చెరువుగా అందుబాటులోకి రానుంది. మరికొన్ని చెరువుల పనులు పూర్తయిన వెంటనే వాటిని కూడా ప్రజలకు అంకితం చేస్తామని చెప్పారు.నగరంలో గతంలో 1,372 చెరువులు ఉండగా, దాదాపు సగం చెరువులు కనుమరుగయ్యాయని రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. చెరువుల ఆక్రమణల వల్ల వర్షాకాలంలో కాలనీలు, రహదారులు ముంపునకు గురవుతున్నాయని తెలిపారు. జలవనరులను కాపాడితేనే నగరాన్ని వరదల నుంచి రక్షించగలమని స్పష్టం చేశారు. **నాగార్జునకు సీఎం అభినందనలు**తమ్మిడికుంట అభివృద్ధికి సినీనటుడు అక్కినేని నాగార్జున స్వచ్ఛందంగా రెండు ఎకరాల భూమిని ప్రభుత్వానికి అప్పగించడంపై సీఎం అభినందనలు తెలిపారు. చెరువుల పరిరక్షణకు ప్రజలు, రాజకీయ పార్టీలు సహకరించాలని కోరారు. మూసీ నది పునరుజ్జీవన పనులను కూడా త్వరలో ప్రారంభిస్తామని, ఈ ప్రాజెక్టు వల్ల ఎవరికీ నష్టం కలగకుండా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.హైదరాబాద్‌ను ప్రపంచస్థాయి నగరంగా తీర్చిదిద్దడంతోపాటు చెరువుల ఆధారంగా ఆర్థిక, పర్యాటక కార్యకలాపాలను అభివృద్ధి చేయడమే ప్రభుత్వ లక్ష్యమని రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు.

ఎరువుల రాయితీకి రూ.62,370 కోట్లు

- **రబీ సీజన్ 202627కు కేంద్ర క్యాబినెట్ ఆమోదం..**
- **గత సీజన్‌తో పోలిస్తే 64 శాతం పెంపు**

న్యూఢిల్లీ,నవంబర్ 11(నేటి మినిట్ టు మినిట్): రబీ సీజన్ 202627కు సంబంధించి ఫాస్ఫేటిక్, పొటాషిక్ (పీ అండ్ కే) ఎరువులపై రూ.62,370.02 కోట్ల రాయితీకి కేంద్ర మంత్రివర్గం ఆమోదం తెలిపింది. ప్రధాని నరేంద్ర మోడీ అధ్యక్షతన బుధవారం జరిగిన క్యాబినెట్ సమావేశంలో ఈ నిర్ణయం తీసుకున్నారు. గత రబీ సీజన్‌లో ఈ రాయితీ కోసం రూ.37,952.29 కోట్లు కేటాయించగా, ఈసారి అదనంగా రూ.24,417.73 కోట్లు పెంచారు. అంటే గత ఏడాదితో పోలిస్తే సుమారు 64 శాతం పెంపు జరిగింది.అంతర్జాతీయ మార్కెట్‌లో ఎరువులు, ముడిసరుకుల ధరల్లో వచ్చిన మార్పుల నేపథ్యంలో రైతులకు అందుబాటు ధరల్లో ఎరువులు సరఫరా చేయాలనే ఉద్దేశంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు కేంద్రం వెల్లడించింది. డీఏపీ, ఎన్‌పీకేఎస్ తదితర రకాల ఎరువులకు ఈ రాయితీ వర్తించనుంది. 2026 అక్టోబర్ 1 నుంచి 2027 మార్చి 31 వరకు ఆమోదించిన రాయితీ ధరలు అమల్లో ఉంటాయి.**రైతులకు అందుబాటు ధరల్లో ఎరువులు** పోషక ఆధారిత రాయితీ పథకం (ఎన్‌బీఎస్) కింద ఫాస్ఫేటిక్, పొటాషిక్ ఎరువులపై ప్రభుత్వం రాయితీ అందిస్తోంది. ప్రస్తుతం డీఏపీతో సహా 28 రకాల పీ అండ్ కే ఎరువులను ఈ పథకం ద్వారా రైతులకు అందుబాటులో ఉంచుతున్నారు. ఎరువుల తయారీదారులు, దిగుమతిదారులకు ఆమోదించిన రేట్ల ప్రకారం రాయితీ చెల్లించనున్నారు. తద్వారా రైతులకు ఎరువుల సరఫరాలో అంతరాయం లేకుండా చూడటంతో పాటు ధరలను అందుబాటులో ఉంచాలని కేంద్రం లక్ష్యంగా పెట్టుకుంది. **డీఏపీ ధరపై ప్రత్యేక వెసులుబాటు** 50 కిలోల డీఏపీ బస్తా ధరను రూ.1,350 వద్ద కొనసాగించే ప్రత్యేక ఏర్పాటును కూడా కేంద్రం కొనసాగించనుంది. అంతర్జాతీయంగా ఎరువుల ధరలు పెరిగినప్పటికీ రైతులపై అదనపు భారం పడకుండా ఈ చర్యలు తీసుకుంటున్నట్లు కేంద్రం తెలిపింది. రష్యాఉక్రెయిన్ యుద్ధం, పశ్చిమాసియాలో ఉద్రిక్తతల కారణంగా అంతర్జాతీయ సరఫరా వ్యవస్థపై ప్రభావం పడటంతో ఎరువుల ధరలు పెరిగాయి. ఈ నేపథ్యంలో రాయితీ పెంపు ద్వారా రైతులకు కొంత ఉపశమనం కల్పించాలని కేంద్రం నిర్ణయించింది.



స్వచ్ఛ సర్వేక్షణ్‌లో ఏపీకి ఆరు జాతీయ అవార్డులు

(మొదటి పేజీ తరువాయి)

అందజేశారు. రాష్ట్రం తరఫున మున్సిపల్ పరిపాలన, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పొంగూరు నారాయణ అవార్డులు స్వీకరించారు.విజయవాడ, గుంటూరు, తిరుపతి నగరపాలక సంస్థలు 'సూపర్ స్వచ్ఛ లీగ్' విభాగంలో అవార్డులు సాధించాయి. గ్రేటర్ విశాఖపట్నం మున్సిపల్ కార్పొరేషన్ 'సఫాయి మిత్ర సురక్షిత్ షెహర్' విభాగంలో పురస్కారం దక్కించుకుంది. పారిశుద్ధ్య కార్మికుల భద్రతకు తీసుకున్న చర్యలకు ఈ గుర్తింపు లభించింది. రాజమహేంద్రవరం నగరపాలక సంస్థ 'ప్రామిసింగ్ స్వచ్ఛ షెహర్' అవార్డును అందుకుంది. 20 వేలలోపు జనాభా కలిగిన పట్టణాల విభాగంలో కుప్పం మున్సిపాలిటీ 'స్వచ్ఛ సిటీ'గా ఎంపికైంది. **విశాఖకు దేశంలోనే అగ్రస్థానం**పది లక్షలకు పైగా జనాభా ఉన్న నగరాల విభాగంలో గ్రేటర్ విశాఖపట్నం దేశంలోనే అత్యంత పరిశుభ్రమైన నగరంగా గుర్తింపు పొందింది. 'సూపర్ స్వచ్ఛ లీగ్' విభాగంలో విజయవాడ దేశవ్యాప్తంగా మూడో స్థానాన్ని సాధించింది. దేశవ్యాప్తంగా 4,751 పట్టణ స్థానిక సంస్థలను పరిగణనలోకి తీసుకుని ఈ సర్వే నిర్వహించారు.పట్టణాల్లో చెత్త సేకరణ, వ్యర్థాల నిర్వహణ, పారిశుద్ధ్యం, ప్రజారోగ్యం, పారిశుద్ధ్య కార్మికుల సంక్షేమం వంటి అంశాల ఆధారంగా ర్యాంకులు, అవార్డులను ప్రకటించారు. ప్రజల భాగస్వామ్యంతో పారిశుద్ధ్య ప్రమాణాలను మెరుగుపరిచేందుకు చేపట్టిన చర్యలు ఈ గుర్తింపునకు దోహదపడ్డాయని అధికారులు తెలిపారు.ఈ పురస్కారాలు రాష్ట్రంలోని పట్టణ స్థానిక సంస్థలకు మరింత బాధ్యతను పెంచాయని, పరిశుభ్రమైన నగరాల నిర్మాణానికి ప్రజలు, అధికారులు, పారిశుద్ధ్య కార్మికులు సమష్టిగా కృషి చేయాలని పేర్కొన్నారు.

రేపు ఏపీ పంచాయతీ ఎన్నికల షెడ్యూల్ విడుదల

అమరావతి,నవంబర్ 11(నేటి మినిట్ టు మినిట్): ఆంధ్రప్రదేశ్‌లో గ్రామ పంచాయతీ ఎన్నికల నిర్వహణకు రాష్ట్ర ఎన్నికల సంఘం సిద్ధమైంది. ఎన్నికల షెడ్యూల్‌ను నవంబర్ 13న విడుదల చేయనున్నట్లు సమాచారం. రాష్ట్ర ఎన్నికల కమిషనర్ అనిల్‌చంద్ర పునేఠా శుక్రవారం మధ్యాహ్నం 12.30 గంటలకు మీడియా సమావేశం నిర్వహించి ఎన్నికల వివరాలను వెల్లడించనున్నారు.రాష్ట్రవ్యాప్తంగా గ్రామ పంచాయతీ ఎన్నికలను మూడు విడతల్లో నిర్వహించేందుకు ప్రణాళిక రూపొందించారు. తొలి విడతకు నవంబర్ 13న, రెండో విడతకు నవంబర్ 16న, మూడో విడతకు నవంబర్ 19న నోటిఫికేషన్లు జారీ చేయనున్నారు. ఆయా విడతల్లో నవంబర్ 26, నవంబర్ 29, డిసెంబర్ 2 తేదీల్లో పోలింగ్ నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. పోలింగ్ రోజే ఓట్ల లెక్కింపు, ఫలితాల ప్రకటన కూడా ఉండనుంది. **మూడు విడతల్లో ఎన్నికల ప్రక్రియ** తొలి విడతలో నామినేషన్ల స్వీకరణకు నవంబర్ 17 చివరి తేదీగా నిర్ణయించారు. రెండో విడతకు నవంబర్ 20, మూడో విడతకు నవంబర్ 23 వరకు నామినేషన్లు స్వీకరించనున్నారు. నామినేషన్ల పరిశీలన, ఉపసంహరణ ప్రక్రియ పూర్తయిన తర్వాత అభ్యర్థుల తుది జాబితాలను ప్రకటిస్తారు. **13,219 పంచాయతీలకు ఎన్నికలు** రాష్ట్రంలో 13,219 గ్రామ పంచాయతీలకు ఎన్నికలు నిర్వహించేందుకు ఎన్నికల సంఘం ఏర్పాట్లు చేస్తోంది. ఎన్నికల నిర్వహణకు అవసరమైన సిబ్బంది, పోలింగ్ కేంద్రాలు, భద్రతా ఏర్పాట్లపై అధికారులు దృష్టి సారించారు. ఎన్నికల షెడ్యూల్ విడుదలతో గ్రామీణ ప్రాంతాల్లో రాజకీయ సందడి మొదలుకానుంది. సర్పంచ్, వార్డు సభ్యుల స్థానాల కోసం ఆశావహులు సిద్ధమవుతున్నారు.

సోనియా, రాహుల్‌తో వైఎస్ షర్మిల భేటీ

(మొదటి పేజీ తరువాయి)

ఢిల్లీలో కాంగ్రెస్ అగ్రనేతలు సోనియాగాంధీ, రాహుల్‌గాంధీలను కలిశారు. తన భర్త అనిల్‌కుమార్‌తో కలిసి వారితో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ బలోపేతం, రాజకీయ పరిణామాలపై చర్చించినట్లు సమాచారం.సోనియాగాంధీతో జరిగిన భేటీలో రాష్ట్రంలో పార్టీ పరిస్థితి, భవిష్యత్ కార్యాచరణ, స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ సాధించిన ఫలితాలను షర్మిల వివరించినట్లు వార్తా కథనాలు వెల్లడించాయి. ఈ సందర్భంగా సోనియాగాంధీ తన ఆత్మకథ 'బిలాంగింగ్: ఏ జర్నీ ఆఫ్ లవ్' పుస్తకాన్ని షర్మిలకు బహూకరించారు. దానిపై వ్యక్తిగత సందేశంతో సంతకం చేసి అందజేశారు. ఈ అరుదైన కానుక తనకు ఎంతో విలువైన జ్ఞాపకమని షర్మిల పేర్కొన్నారు.రాహుల్‌గాంధీని కలిసి తన కుమార్తె వైఎస్ అంజలిరెడ్డి వివాహానికి ఆహ్వానించారు. వివాహ ఆహ్వాన పత్రికను అందజేసి, పెళ్లికి హాజరై వధూవరులను ఆశీర్వదించాలని కోరారు. నవంబర్ 25న వివాహం, డిసెంబర్ 5న రిసెప్షన్ నిర్వహించనున్నట్లు సమాచారం.

కొత్త పార్టీ ప్రకటించిన విజయసాయిరెడ్డి

అమరావతి,నవంబర్ 11(నేటి మినిట్ టు మినిట్): వైసీపీ మాజీ నాయకుడు, మాజీ రాజ్యసభ సభ్యుడు విజయసాయిరెడ్డి కొత్త రాజకీయ పార్టీని ప్రకటించారు. 'దేశం కోసం.. ధర్మం కోసం' అనే నినాదంతో లిలిపరివర్తన రాజనీతి పార్టీ (పీఆర్‌పీ)లిలిని ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడించారు. బుధవారం విజయవాడలోని ఎప్లస్ కన్వెన్షన్‌లో జరిగిన సమావేశంలో పార్టీ పేరును ప్రకటించి, జెండాను ఆవిష్కరించారు.కాషాయ, తెలుపు రంగులతో మధ్యలో చక్రం గుర్తు ఉండేలా పార్టీ జెండాను రూపొందించారు. అంతకుముందు తాడేపల్లిలోని తన నివాసం నుంచి ప్రదర్శనగా సమావేశ ప్రాంగణానికి చేరుకున్నారు. తన ప్రసంగంలో రెండు ప్రధాన రాజకీయ పార్టీలు, రెండు రాజకీయ కుటుంబాల ఆధిపత్యంపై ఆయన ప్రస్తావించారు.

కూటమి అక్రమాలను ప్రజలు గమనించారు

(మొదటి పేజీ తరువాయి)

స్థానిక సంస్థల ఎన్నికలు ముగిసిన నేపథ్యంలో పలు జిల్లాలకు చెందిన వైసీపీ నాయకులు బుధవారం తాడేపల్లిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో జగన్‌ను కలిశారు. ఎన్నికలు జరిగిన తీరు, ఎదురైన సమస్యలు, ఫలితాలపై ఆయన వారితో చర్చించారు. ఈ సందర్భంగా జగన్ మాట్లాడుతూ.. గతంలో ఎన్నడూ లేని విధంగా నామినేషన్ పత్రాలను చించివేయడం, అభ్యర్థులను అనర్హులుగా ప్రకటించడం, గెలిచిన అభ్యర్థులను సైతం ఓడిపోయినట్లు చూపించడం వంటి చర్యలకు పాల్పడ్డారని విమర్శించారు. **ప్రతి దశలోనూ అక్రమాలే..** ఎన్నికల షెడ్యూల్ ప్రకటించినప్పటి నుంచి ఓట్ల లెక్కింపు పూర్తయ్యే వరకు దాడులు, దౌర్జన్యాలు కొనసాగాయని జగన్ ఆరోపించారు. ఎన్నికల్లో ప్రజలు ఓటు వేస్తే ప్రభుత్వం ఇబ్బందుల్లో పడుతుందనే భయంతోనే ముఖ్యమంత్రి ఎన్నికలను ఏకపక్షంగా నిర్వహించేందుకు కుట్ర పన్నారని విమర్శించారు. అక్రమాలను ఎదుర్కొని వైసీపీ గెలిచిన చోట్ల కూడా ఫలితాలను తారుమారు చేశారని అన్నారు. వైసీపీ హయాంలో అక్రమాలు జరిగాయంటూ తప్పుడు ఆరోపణలు చేస్తూ, ప్రస్తుత ఎన్నికల్లో జరిగిన అక్రమాలను సమర్థించుకునే ప్రయత్నం చేస్తున్నారని మండిపడ్డారు. **ఓట్ల లెక్కింపులోనూ అవకతవకలు** ఓట్ల లెక్కింపు సమయంలో చెల్లని ఓట్ల పేరుతో వైసీపీకి వచ్చిన ఓట్లను పెద్ద సంఖ్యలో తొలగించారని జగన్ ఆరోపించారు. లెక్కింపు కేంద్రాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేసి ఫలితాలను తారుమారు చేశారని విమర్శించారు. వైసీపీ గెలిచిన ప్రాంతాల్లో పదేపదే రీకౌంటింగ్ నిర్వహించి లెక్కల్లో మార్పులు చేశారని, తమ పార్టీ కోరిన చోట మాత్రం రీకౌంటింగ్‌కు అవకాశం ఇవ్వలేదని తెలిపారు. **ఎన్నికల సంఘం విఫలమైంది** ఎన్నికలను స్వేచ్ఛగా, నిష్పక్షపాతంగా నిర్వహించాల్సిన రాష్ట్ర ఎన్నికల సంఘం పూర్తిగా విఫలమైందని జగన్ విమర్శించారు. ఓట్ల లెక్కింపు కేంద్రాల్లో ఏజెంట్లకు బదులుగా బౌన్సర్లను నియమించారని, అభ్యర్థుల బంధువులను కిడ్నాప్ చేసి నామినేషన్లు ఉపసంహరించుకునేలా ఒత్తిడి తెచ్చారని ఆరోపించారు. అధికార పార్టీకి అనుకూలంగా అదనపు బ్యాలెట్ పత్రాలు ఇచ్చి ఆ పార్టీ అభ్యర్థులు గెలిచేలా అక్రమాలకు పాల్పడ్డారని అన్నారు.ఇన్ని అవరోధాలు, అక్రమాలు ఎదురైనా వైసీపీ కార్యకర్తలు కష్టపడి పనిచేశారని జగన్ పేర్కొన్నారు. 2024 ఎన్నికలతో పోలిస్తే ప్రస్తుత స్థానిక సంస్థల ఎన్నికల్లో వైసీపీ ఓటింగ్ శాతం పెరిగిందని తెలిపారు. ఈ ఎన్నికల్లో ప్రతి గ్రామంలోనూ బాధితులు ఉన్నారని అన్నారు.

హెచ్.ఎన్.ఎస్.ఎస్. నీటి విడుదల ప్రక్రియను క్షేత్రస్థాయిలో పరిశీలించిన జిల్లా కలెక్టర్



కర్నూలు నవంబర్ 11(నేటి మినిట్ టు మినిట్): హెచ్.ఎన్.ఎస్.ఎస్. (హంద్రీ–నీవా సుజల స్రవంతి) కాల్వ ద్వారా నీటి విడుదల ప్రక్రియను జిల్లా కలెక్టర్ డా.ఏ.సిరి క్షేత్రస్థాయిలో పరిశీలించి అధికారులకు పలు సూచనలు జారీ చేశారు.బుధవారం నందికొట్కూరు మండలంలోని మల్యాల పంప్ హౌస్ ను కలెక్టర్ పరిశీలించారు.ఈ సందర్భంగా కలెక్టర్ ముందుగా మల్యాల పంప్ హౌస్, ఫోర్ బే, లింక్ ఛానల్ ద్వారా నీటి సరఫరా జరుగుతున్న విధానాన్ని పరిశీలిస్తూ సంబంధిత ఇంజనీరింగ్ అధికారులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. మల్యాల పంప్ హౌస్ వద్ద మూడు పంపుల ద్వారా 920 క్యూసెక్కుల నీటిని హెచ్.ఎన్.ఎస్.ఎస్. కాల్వలోకి విడుదల చేస్తున్నట్లు అధికారులు కలెక్టర్ కి వివరించారు. ఆగస్టు 5వ తేదీ నుంచి నిరంతరాయంగా నీటి విడుదల కొనసాగుతుండగా, ఇప్పటివరకు మొత్తం 21 టీఎంసీల నీటిని విడుదల చేసినట్లు అధికారులు తెలిపారు.. ముచ్చుమర్రి నుంచి మల్యాల ఫోర్ బే కు 17 కిలోమీటర్ల లింక్ ఛానల్ ద్వారా నీరు చేరుతుందని, అక్కడి నుంచి పంపింగ్ ప్రక్రియ ద్వారా హెచ్.ఎన్.ఎస్.ఎస్. కాల్వలోకి నీటిని విడుదల చేస్తున్నట్లు అధికారులు వివరించారు. హెచ్.ఎన్.ఎస్.ఎస్. నీటి విడుదలకు సంబంధించిన మొత్తం ప్రక్రియను కలెక్టర్ క్షేత్రస్థాయిలో పరిశీలించి, పంపింగ్ వ్యవస్థ, కాల్వ ద్వారా నీటి విడుదల, నీటి సరఫరా విధానాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో హెచ్.ఎన్.ఎస్.ఎస్ ఎస్ఈ రాజన్ బాబు, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు క్రిష్టన్న, ప్రసాద్ రావు తదితరులు పాల్గొన్నారు.

జిల్లా కేంద్ర గ్రంథాలయంలో మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతి వేడుకలు



కాకినాడ నవంబర్ 11(నేటి మినిట్ టు మినిట్): జిల్లా కేంద్ర గ్రంథాలయంలో, బుధవారం భారతదేశ తొలి విద్యాశాఖ మంత్రి, ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధుడు, విద్యావేత్త, భారతరత్న మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముందుగా ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి కె జె ఎస్ ఎస్. కుమారి మౌలానా అబుల్ కలాం ఆజాద్ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు.అనంతరం కార్యదర్శి కె జె ఎస్ ఎల్. కుమారి మాట్లాడుతూ, మౌలానా అబుల్ కలాం ఆజాద్ దేశ స్వాతంత్ర్య ఉద్యమంలో కీలక పాత్ర పోషించడంతో పాటు, భారతదేశ విద్యావ్యవస్థ అభివృద్ధికి విశేష కృషి చేశారని తెలిపారు. విద్య ద్వారానే సమాజాభివృద్ధి, దేశ ప్రగతి సాధ్యమవుతాయని ఆయన నమ్మారని, ఆయన ఆశయాలను ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని పాఠకులకు తెలిపారు.జిల్లా కేంద్ర గ్రంథాలయం డిప్యూటీ లైబ్రేరియన్ ఇన్‌చార్జ్ కె. కిషోర్, సీనియర్ అసిస్టెంట్ యం. శ్రావ్య, గ్రంథాలయ సిబ్బంది ఎస్. రాజు, ఎ వి ఎస్ . నాగేంద్ర కుమార్, జీ. దుర్గాప్రసాద్, వి. అరుణ, గ్రంథాలయ పాఠకులు, విద్యార్థినీ విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

బ్లాక్ స్పాట్ల వద్ద భద్రతా చర్యలు వేగవంతం చేయాలి: కలెక్టర్ డా.ఏ.సిరి



కర్నూలు నవంబర్ 11(నేటి మినిట్ టు మినిట్): జిల్లాలో రోడ్డు ప్రమాదాల నివారణకు గుర్తించిన 17 బ్లాక్ స్పాట్ల వద్ద భద్రతా చర్యలను వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ డా.ఏ.సిరి అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లో ఎస్పీ విక్రాంత్ పాటిల్‌తో కలిసి రోడ్ సేఫ్టీ కమిటీ సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ స్పీడ్ బ్రేకర్ల వద్ద వైట్ పెయింటింగ్, రోడ్డు మార్కింగ్స్, రిఫ్లెక్టర్లు, హెచ్చరిక బోర్డుల ఏర్పాటును ఐదు రోజుల్లో పూర్తి చేయాలన్నారు. బళ్లారి క్రాస్ రోడ్డు నుంచి పెద్దపాడు వరకు ప్రమాదాల నివారణకు డివైడర్లు ఏర్పాటు చేయడంతో పాటు రోడ్లపై గుంతలకు తక్షణమే మరమ్మతులు చేపట్టాలని సూచించారు. పెండింగ్ హిట్ అండ్ రన్ కేసులను త్వరగా పరిష్కరించాలని ఆదేశించారు.ఎస్పీ విక్రాంత్ పాటిల్ మాట్లాడుతూ ఎన్‌హెచ్-44, ఎన్‌హెచ్-40తో పాటు ఆర్‌అండ్‌బీ రహదారులపై ఎక్కువ ప్రమాదాలు నమోదవుతున్నాయని తెలిపారు. సమావేశంలో పలువురు జిల్లా అధికారులు పాల్గొన్నారు.

ప్రతి విద్యార్థి ఆయనను స్ఫూర్తిగా తీసుకోవాలి: అమీర్ బాబు



కడప నవంబర్ 11(నేటి మినిట్ టు మినిట్): భారతదేశ తొలి విద్యాశాఖ మంత్రిగా స్వర్గీయ మౌలానా అబ్దుల్ కలాం ఆజాద్ చేసిన సేవలు మరువలేమని కడప టిడిపి నియోజకవర్గ మాజీ ఇంచార్జ్ వి. ఎస్. అమీర్ బాబు అన్నారు. బుధవారం ఆజాద్ జయంతి సందర్భంగా కో-ఆపరేటివ్ కాలనీ లో వారి కార్యాలయం నందు ఆజాద్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఆ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్క విద్యార్థి ఆయనను స్ఫూర్తిగా తీసుకొని విద్యార్థులు ముందుకు నడవాలని అయినా అన్నారు. మౌలానా జయంతి నీ రాష్ట్ర ప్రభుత్వం మైనార్టీస్ డే నిర్వహిస్తూ వస్తున్నారని ఆయన అన్నారు ఈ కార్యక్రమంలో రఫీ ఖాన్. . షేక్ మగ్బూల్ అహ్మద్ పాల్గొన్నారు.

నోరు జారింది.. వివాదం రాజుకుంది

● కమ్మ సామాజిక వర్గంపై బూతుల వర్షం.. వీడియో వైరల్‌తో రాజకీయ దుమారం ● టిడిపి పార్టీ క్రమశిక్షణ చర్యలు ఎందుకు తీసుకోలేదో...? ● ముందు నోటికి పని.. తర్వాత క్షమాపణలు.. ఇదేం రాజకీయం? ● కమ్మ సామాజిక వర్గంపై అనుచిత వ్యాఖ్యలు.. వీడియో నకిలీ అంటూ బుకాయింపు ● వైరల్ వీడియోతో ఉలిక్కిపడ్డ నేత.. వైఎస్సార్‌సీపీ కుట్ర అంటూ ఎదురుదాడి ● బూతులు మాట్లాడి.. వీడియో బయటకొచ్చాక మాట మార్చారా? ● అనంతపురం రుద్రంపేటలో కలకలం.. కమ్మ వర్గంపై వ్యాఖ్యలతో వివాదం ● వీడియో ఒరిజినలా? నకిలీనా? రుద్రంపేట వివాదంపై ఉత్కంఠ ● కులంపై అనుచిత వ్యాఖ్యలు.. సోషల్ మీడియాలో వ్యక్తిపై తీవ్ర ఆగ్రహం ● వీడియో లీక్‌తో రాజకీయ ప్రకంపనలు.. అసలు నిజం ఏమిటి? ● తిట్ల వీడియో వైరల్.. ఆపై రాజకీయ కుట్ర ఆరోపణలు.. రుద్రంపేటలో చర్చ

అనంతపురం, నవంబర్ 11(నేటి మినిట్ టు మినిట్): కమ్మ సామాజిక వర్గాన్ని ఉద్దేశించి అనుచిత పదజాలంతో మాట్లాడినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న అనంతపురం రుద్రంపేటకు చెందిన ఎంపీటీసీ భర్త వ్యవహారం ప్రస్తుతం సోషల్ మీడియాలో తీవ్ర చర్చనీయాంశంగా మారింది. కమ్మ సామాజిక వర్గంపై అసభ్యకర వ్యాఖ్యలు చేసినట్లు ఉన్న వీడియో సోషల్ మీడియాలో వైరల్ కావడంతో రాజకీయంగా కూడా కలకలం రేగింది. వైరల్ అవుతున్న వీడియోలో సదరు వ్యక్తి కమ్మ సామాజిక వర్గాన్ని ఉద్దేశించి అభ్యంతరకర వ్యాఖ్యలు చేసినట్లు కనిపిస్తోంది. ఈ వీడియో బయటకు రావడంతో రాష్ట్రవ్యాప్తంగా పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఒక సామాజిక వర్గాన్ని కించపరిచేలా మాట్లాడటం ఏమిటంటూ సోషల్ మీడియా వేదికగా నిరసన వ్యక్తం చేస్తున్నారు.

వీడియో వైరల్ కావడంతో తెరపైకి క్షమాపణలు

వీడియో వైరల్ కావడంతో సదరు వ్యక్తి స్పందిస్తూ, ఆ వీడియో నకిలీదని, ప్రతిపక్ష రాజకీయ శక్తులు తనపై దుష్ప్రచారం చేస్తున్నాయని ఆరోపించినట్లు ప్రచారం జరుగుతోంది. అయితే వైరల్ అవుతున్న వీడియో వాస్తవమైనదేనని, తన తమ్ముడే ఆ వీడియోను విడుదల చేసినట్లు సోషల్ మీడియాలో వాదనలు వినిపిస్తున్నాయి. ఈ అంశంపై స్వతంత్రంగా పూర్తి నిర్ధారణ కావాల్సి ఉంది.

తప్పు చేసి రాజకీయ కుట్ర అంటూ సమర్థించుకుంటున్నారా?

మొదట అభ్యంతరకర వ్యాఖ్యలు చేసి, వీడియో బయటకు వచ్చిన తర్వాత రాజకీయ కుట్ర అంటూ సమర్థించుకోవడం ఎంతవరకు సమంజసమని పలువురు ప్రశ్నిస్తున్నారు. ఒకవైపు వీడియో వైరల్ అవుతుండగా, మరోవైపు వైఎస్సార్‌సీపీపై కుట్ర



ఆరోపణలు చేయడం రాజకీయ చర్చకు దారితీసింది.

కమ్మ సామాజిక వర్గంలో ఆగ్రహం

కమ్మ సామాజిక వర్గంపై అనుచిత వ్యాఖ్యలు చేసి, అనంతరం క్షమాపణలు చెప్పడం సాధారణంగా మారిపోయిందా అంటూ కొందరు సామాజిక మాధ్యమాల్లో మండిపడుతున్నారు. ఏ సామాజిక వర్గమైనా సరే, వ్యక్తుల మధ్య రాజకీయ విభేదాలను కులాలపైకి తీసుకెళ్లడం తగదని అభిప్రాయపడుతున్నారు.

అసలు వీడియోపై స్పష్టత ఎప్పుడు?

వైరల్ అవుతున్న వీడియో ఒరిజినలా? ఎడిట్ చేసినదా? అందులోని వ్యాఖ్యలు ఏ సందర్భంలో చేశారనే అంశాలపై పూర్తి స్థాయి స్పష్టత రావాల్సి ఉంది. వీడియో అసలు మూలం, దాని ప్రామాణికతపై నిర్ధారణ వచ్చిన తర్వాతే వాస్తవాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉంది. వైరల్ అవుతున్న వీడియో నకిలీదా లేక ఒరిజినల్‌దా అనే విషయం సంబంధిత అధికారులు సమగ్రంగా విచారణ చేపడితే అసలు



ఈ వీడియోలో స్పష్టంగా వినిపిస్తున్న బూతులు

వాస్తవాలు వెలుగులోకి వస్తాయని ప్రజలు, కమ్మ సామాజిక వర్గానికి చెందిన పలువురు అభిప్రాయపడుతున్నారు. వీడియో నిజమైనదా, ఎక్కడ చిత్రీకరించారు, దాని వెనుక ఉన్న వాస్తవాలేమిటనే అంశాలను నిష్పక్షపాతంగా పరిశీలించాలని డిమాండ్ చేస్తున్నారు. సోషల్ మీడియాలో పరస్పర ఆరోపణలు చేసుకోవడం కంటే విచారణ ద్వారా నిజానిజాలు తేల్చాలని, బాధ్యులెవరో బయటపెట్టాలని వారు కోరుతున్నారు.మొత్తానికి, కమ్మ సామాజిక వర్గంపై చేసినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న వ్యాఖ్యలు, అనంతరం తెరపైకి వచ్చిన వివరణలు, రాజకీయ ఆరోపణలు ప్రస్తుతం అనంతపురం రాజకీయాల్లో చర్చనీయాంశంగా మారాయి.

చేయి చచ్చుబడిందని నిరాశ వద్దు.. మళ్లీ కదిలించవచ్చు!

● ఆధునిక శస్త్రచికిత్సలతో బ్రేకియల్ ప్లెక్సస్ ఇంజూరీకి చికిత్స ● రోడ్డు ప్రమాదాలతో యువతలో పెరుగుతున్న చేతి నరాల గాయాలు ● సకాలంలో వైద్యుడిని సంప్రదిస్తే మెరుగైన ఫలితాలు ● ప్రముఖ సర్జన్ డాక్టర్ ఆర్.వి. కోటేశ్వరరావు వెల్లడి



గుంటూరు నవంబర్ 11(నేటి మినిట్ టు మినిట్): రోడ్డు ప్రమాదాల్లో చేతికి సరఫరా చేసే నరాలు దెబ్బతిని చేయి చచ్చుబడిపోయినంత మాత్రాన జీవితంపై ఆశలు వదులుకోవాల్సిన అవసరం లేదని, ఆధునిక శస్త్రచికిత్సల ద్వారా తిరిగి చేతికి కదలికలు, స్పర్శ తీసుకురావడానికి అవకాశాలు ఉన్నాయని యశోద హాస్పిటల్ ప్రముఖ ప్లాస్టిక్ అండ్ రీకన్‌స్ట్రక్టివ్ సర్జన్, బ్రేకియల్ ప్లెక్సస్ సర్జన్ డాక్టర్ ఆర్.వి. కోటేశ్వరరావు తెలిపారు. నరాల గాయాలను నిర్లక్ష్యం చేయకుండా సకాలంలో నిపుణులైన వైద్యులను సంప్రదించి తగిన చికిత్స పొందాలని సూచించారు.గుంటూరులోని హోటల్ సింధూరిలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన బ్రేకియల్ ప్లెక్సస్ ఇంజూరీ (చేతికి సరఫరా చేసే నరాల గాయం) గురించి వివరించారు.**ద్విచక్ర వాహన ప్రమాదాలే ప్రధాన కారణం....!**ఈ సందర్భంగా డాక్టర్ ఆర్ వి కోటేశ్వరరావు మాట్లాడుతూ ప్రస్తుతం రోడ్డు ప్రమాదాల కారణంగా ముఖ్యంగా టీనేజర్లు, యువతలో బ్రేకియల్ ప్లెక్సస్ ఇంజూరీ కేసులు ఎక్కువగా కనిపిస్తున్నాయని తెలిపారు. ద్విచక్ర వాహన ప్రమాదాల్లో భుజం ప్రాంతానికి బలమైన దెబ్బ తగలడం వల్ల చేతికి సంబంధించిన నరాలు దెబ్బతింటున్నాయని వివరించారు. ఈ నరాల గాయాల తీవ్రతను బట్టి కొందరిలో భుజం కదలికలు నిలిచిపోతే, మరికొందరిలో మోచేయి పని చేయదని, ఇంకొందరిలో భుజం నుంచి వేళ్ల వరకు చేయి పూర్తిగా చచ్చుబడినట్లుగా మారుతుందని పేర్కొన్నారు.**లక్షణాలు కనిపిస్తే నిర్లక్ష్యం వద్దు**చేతిలో కదలికలు లేకపోవడం, స్పర్శ కోల్పోవడం, భుజం లేదా మోచేయి పనిచేయకపోవడం వంటి లక్షణాలు కనిపించినప్పుడు వెంటనే వైద్యులను సంప్రదించాలని సూచించారు. చాలామంది సరైన అవగాహన లేకుండా చికిత్సలో జాప్యం చేస్తున్నారని, మరికొందరు కేవలం ఫిజియోథెరపీతోనే సమస్య పరిష్కారమవుతుందని భావిస్తున్నారని తెలిపారు. దీనివల్ల నరాలకు సంబంధించిన శస్త్రచికిత్సలు చేయాల్సిన సరైన సమయం దాటిపోయే ప్రమాదం ఉందన్నారు.**ఆధునిక శస్త్రచికిత్సలతో తిరిగి చేతికి కదలికలు**బ్రేకియల్ ప్లెక్సస్ ఇంజూరీ చికిత్సలో భాగంగా దెబ్బతిన్న నరాలను తిరిగి జోడించడం, ఇతర నరాలను అనుసంధానం చేయడం, కండరాల మార్పిడి, టెండన్ ట్రాన్స్‌ఫర్ వంటి ఆధునిక శస్త్రచికిత్సా విధానాలు అందుబాటులో ఉన్నాయని డాక్టర్ కోటేశ్వరరావు వివరించారు. బాధితుడి వయస్సు, నరాల గాయం తీవ్రత, ప్రమాదం జరిగినప్పటి నుంచి గడిచిన సమయాన్ని బట్టి తగిన చికిత్సను ఎంపిక చేస్తారని తెలిపారు. సకాలంలో శస్త్రచికిత్స, తదుపరి పునరావాస చికిత్స అందితే చేతికి తిరిగి కదలికలు, స్పర్శ మెరుగుపడటంతో పాటు బాధితులు తమ రోజువారీ పనులను స్వయంగా చేసుకునే అవకాశం ఉంటుందని చెప్పారు.**ప్రతి నెల రెండో బుధవారం ఓ శ్రీ హాస్పిటల్‌లో వైద్య సేవలు**బ్రేకియల్ ప్లెక్సస్ ఇంజూరీపై ప్రజల్లో అవగాహన పెంచేందుకు గుంటూరులో ప్రత్యేక అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. హైదరాబాద్‌లోని యశోద హాస్పిటల్, హైటెక్ సిటీ బ్రాంచ్‌లో ప్లాస్టిక్ అండ్ రీకన్‌స్ట్రక్టివ్ సర్జన్‌గా సేవలందిస్తున్న తాను ఈ కార్యక్రమంలో పాల్గొని బాధితులకు అవసరమైన వైద్య సూచనలు అందించనున్నట్లు పేర్కొన్నారు.గుంటూరు డొంక రోడ్డులోని శ్రీ హాస్పిటల్‌లో ప్రతి నెల రెండో బుధవారం ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు అందుబాటులో ఉంటానని తెలిపారు. చేతి నరాలు దెబ్బతిని ఇబ్బందులు ఎదుర్కొంటున్న బాధితులు ఈ వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.ఈ కార్యక్రమంలో యశోద హాస్పిటల్ ఏపీ మార్కెటింగ్ మేనేజర్ కె. చంద్రశేఖర్, అసిస్టెంట్ మేనేజర్ ఖాసింవలి తదితరులు పాల్గొన్నారు.

అనంతపురం నూతన మేయర్‌కు జగన్ అభినందనలు

● అనంతపురం మేయర్ రమేష్ గౌడ్‌కు జగన్ అభినందనలు ● తాడేపల్లిలో జగన్‌తో నూతన మేయర్ భేటీ ● రమేష్ గౌడ్‌కు జగన్ దిశానిర్దేశం.. ప్రజాసేవే లక్ష్యంగా పనిచేయాలని సూచన ● అనంతపురం అభివృద్ధికి పెద్దపీట వేయాలి: జగన్ ● కుటుంబ సమేతంగా జగన్‌ను కలిసిన అనంతపురం మేయర్ ● మేయర్‌గా బాధ్యతలు.. జగన్ ఆశీస్సులు తీసుకున్న రమేష్ గౌడ్ ● ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకోవాలి.. నూతన మేయర్‌కు జగన్ సూచన





తాడేపల్లి,నవంబర్ 11(నేటి మినిట్ టు మినిట్): అనంతపురం నూతన మేయర్‌గా ఎన్నికైన సి. రమేష్ గౌడ్ (బీసీ రమేష్ గౌడ్) తన కుటుంబ సభ్యులతో కలిసి తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నూతన మేయర్ రమేష్ గౌడ్‌కు వైఎస్ జగన్ అభినందనలు తెలియజేశారు. రాజకీయంగా మరింత ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. మేయర్‌గా బాధ్యతలు చేపట్టిన అనంతరం ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ, వారి సమస్యలను నిజాయితీగా పరిష్కరించాలని సూచించారు. అనంతపురం నగర అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యత ఇవ్వాలని హితవు పలికారు.

ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకోవాలి

అధికార కూటమి నుంచి ఎదురవుతున్న బెదిరింపులు, రాజకీయ ఒత్తిళ్లను ఎదుర్కొంటూ అనంతపురం ప్రజలు వైఎస్సార్‌సీపీకి అండగా నిలిచారని జగన్ పేర్కొన్నారు. ప్రజలు తమపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకునేలా ప్రతి ప్రజాప్రతినిధి అంకితభావంతో పనిచేయాలని సూచించారు. ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ముందుకు సాగాలని దిశానిర్దేశం చేశారు.

జగన్‌కు రమేష్ గౌడ్ కృతజ్ఞతలు

తనకు మేయర్‌గా అవకాశం కల్పించినందుకు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి రమేష్ గౌడ్ కృతజ్ఞతలు తెలిపారు. అనంతపురం ప్రజలకు, తన ఎన్నికకు సహకరించిన పార్టీ నాయకులు, కార్యకర్తలకు ధన్యవాదాలు తెలియజేశారు. నగర అభివృద్ధికి, ప్రజా సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని తెలిపారు.

పలువురు ముఖ్య నేతల హాజరు

ఈ మర్యాదపూర్వక భేటీలో ఎంపీ పెద్దిరెడ్డి మిథున్ రెడ్డి, సీనియర్ నాయకులు అనంత వెంకటరామిరెడ్డి, సాకే శైలజనాథ్, తలారి రంగయ్య, నరేష్ కుమార్ రెడ్డి తదితర నాయకులు పాల్గొన్నారు. నూతన మేయర్ రమేష్ గౌడ్‌కు పలువురు నాయకులు శుభాకాంక్షలు తెలియజేశారు.

34 ఏళ్ల సేవకు తోటి హోంగార్డుల ఆపన్నహస్తం

● రిటైర్డ్ హోంగార్డుకు రూ.4.95 లక్షల ఆర్థిక సాయం ● ఒకరోజు వేతనంతో సహోద్యోగికి అండగా నిలిచిన హోంగార్డులు ● హోంగార్డుల మానవత్వానికి ఎస్పీ జగదీష్ అభినందనలు ● పదవీ విరమణ పొందిన ఒబులేసుకు ఎస్పీ చేతుల మీదుగా చెక్కు అందజేత ● పోలీసు కుటుంబంలో మానవీయతకు నిదర్శనం.. హోంగార్డుకు ఆర్థిక భరోసా



అనంతపురం, నవంబర్ 11(నేటి మినిట్ టు మినిట్): పోలీసు శాఖలో 34 ఏళ్లపాటు సేవలందించి పదవీ విరమణ పొందిన హోంగార్డు ఎస్. ఒబులేసుకు తోటి హోంగార్డులు అండగా నిలిచారు. ఉమ్మడి అనంతపురం జిల్లా హోంగార్డులు తమ ఒక రోజు జీతాన్ని విరాళంగా అందించి సమకూర్చిన రూ.4,95,580 నగదును చెక్కు రూపంలో జిల్లా ఎస్పీ పి. జగదీష్, ఐపీఎస్ చేతుల మీదుగా ఒబులేసుకు అందజేశారు. ఈ సందర్భంగా తోటి హోంగార్డుకు ఆర్థిక సహాయం అందించి మానవత్వాన్ని చాటిన సిబ్బందిని ఎస్పీ అభినందించారు. పోలీసు కుటుంబంలో ఒకరికొకరు అండగా నిలవడం అభినందనీయమని పేర్కొన్నారు. 34 ఏళ్లపాటు పోలీసు శాఖకు సేవలందించిన ఒబులేసు పదవీ విరమణ అనంతరం కుటుంబ సభ్యులతో సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో జీవించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఏఆర్ డీఎస్పీ నీలకంఠేశ్వరరెడ్డి, ఆర్ఐ పవన్ కుమార్, ఆర్ఎస్ఐ జాఫర్ తదితరులు పాల్గొన్నారు.

ఆపరేషన్ గరుడలో భాగంగా మెడికల్ షాప్‌పై ఆకస్మిక తనిఖీలు

● ప్రిస్క్రిప్షన్ లేకుండా మందుల విక్రయాలు.. నిర్వాహకులకు అధికారుల హెచ్చరిక



అనంతపురం, నవంబర్ 11(నేటి మినిట్ టు మినిట్): ఈగల్ ఐజీ ఆకే రవికృష్ణ, ఐపీఎస్ ఆదేశాలు, జిల్లా ఎస్పీ పి. జగదీష్, ఐపీఎస్ సూచనల మేరకు ఆపరేషన్ గరుడలో భాగంగా అనంతపురం నగరంలోని రుద్రంపేట బైపాస్ వద్ద ఉన్న హేమంత్ మెడికల్ అండ్ ఫ్యాన్సీ షాప్‌లో పోలీసులు, డ్రగ్ కంట్రోల్ అధికారులు ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో వైద్యుల ప్రిస్క్రిప్షన్ లేకుండా సాధారణ మందులతో పాటు ఎన్ఆర్ఎక్స్ కేటగిరీ మందులను విక్రయిస్తున్నట్లు గుర్తించారు. దీనిపై డ్రగ్ కంట్రోల్ అధికారులు నిబంధనల ప్రకారం చట్టపరమైన చర్యలు తీసుకోనున్నారు. ప్రిస్క్రిప్షన్ లేకుండా నియంత్రిత మందులు విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని మెడికల్ షాపుల నిర్వాహకులను హెచ్చరించారు. మత్తు మందుల అక్రమ విక్రయాలు, వినియోగంపై సమాచారం ఉంటే ఈగల్ టోల్ ఫ్రీ నంబర్ 1972కు తెలియజేయాలని, సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని అధికారులు తెలిపారు.

కళాశాల భవనం నుంచి కిందపడిన విద్యార్థిని..

కర్నూలుకు తరలింపు

● అనంతపురం మహిళా కళాశాలలో కలకలం.. విద్యార్థిని పరిస్థితి విషమం ● వెంటిలేటర్‌పై విద్యార్థినికి చికిత్స.. మెరుగైన వైద్యం కోసం కర్నూలుకు ● రెండో అంతస్తు నుంచి విద్యార్థిని పతనం.. అసలేం జరిగింది? ● బీఏ విద్యార్థినికి తీవ్ర గాయాలు.. ఆందోళనలో కుటుంబ సభ్యులు ● కేఎస్ఎన్ కళాశాలలో ప్రమాదం.. విద్యార్థిని ఆరోగ్య పరిస్థితిపై ఉత్కంఠ



అనంతపురం, నవంబర్ 11(నేటి మినిట్ టు మినిట్): అనంతపురంలోని కేఎస్ఎన్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో విషాదకర ఘటన చోటుచేసుకుంది. కళాశాల భవనం రెండో అంతస్తు నుంచి ప్రమాదవశాత్తు కిందపడిన బి. వసంత అనే విద్యార్థిని తీవ్రంగా గాయపడింది. పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన వైద్య చికిత్స నిమిత్తం ఆమెను కర్నూలుకు తరలించినట్లు సమాచారం. **రెండో అంతస్తు నుంచి కిందపడిన విద్యార్థిని** నార్పల మండలం బి. పప్పూరు గ్రామానికి చెందిన బి. వసంత కేఎస్ఎన్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో బీఏ హిస్టరీ ద్వితీయ సంవత్సరం చదువుతోంది. నవంబర్ 10, 2026 మంగళవారం ఉదయం కళాశాల భవనం రెండో అంతస్తు నుంచి ఆమె ఒక్కసారిగా కిందపడిపోయింది. ఈ ప్రమాదంలో విద్యార్థినికి తీవ్ర గాయాలవడంతో పాటు ఎముకలు విరిగినట్లు సమాచారం. **వెంటనే ఆసుపత్రికి తరలింపు**ప్రమాదాన్ని గుర్తించిన కళాశాల ప్రిన్సిపల్, సిబ్బంది వెంటనే స్పందించి విద్యార్థినిని అనంతపురం ప్రభుత్వ సర్వజన ఆసుపత్రికి తరలించారు. అక్కడ వైద్యులు ఆమెకు అత్యవసర చికిత్స అందించారు. పరిస్థితి తీవ్రంగా ఉండటంతో ఐసీయూలో వెంటిలేటర్‌పై ఉంచి చికిత్స అందించినట్లు తెలుస్తోంది. **మెరుగైన వైద్యం కోసం కర్నూలుకు** విద్యార్థిని ఆరోగ్య పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని మెరుగైన వైద్య సేవల కోసం కర్నూలు ఆసుపత్రికి తరలించినట్లు సమాచారం. ప్రస్తుతం ఆమెకు వైద్య చికిత్స అందిస్తున్నారు. **ఘటనపై ఆందోళన** కళాశాల భవనం రెండో అంతస్తు నుంచి విద్యార్థిని కిందపడటానికి గల ఖచ్చితమైన కారణాలు తెలియాల్సి ఉంది. ప్రమాదం ఎలా జరిగింది? విద్యార్థిని ప్రమాదవశాత్తు పడిపోయిందా? ఇతర కారణాలేమైనా ఉన్నాయా? అనే అంశాలపై స్పష్టత రావాల్సి ఉంది. ఈ ఘటనతో విద్యార్థిని కుటుంబ సభ్యులు, తోటి విద్యార్థులు ఆందోళనకు గురయ్యారు.

M/S SUNIL PUBLICATIONSPrinting Press (Name & Address)PrinterM/S SUNIL PUBLICATIONS D.NO.: 28-5-782, HOUSING BOARD COLONY, REVENUE WARD NO. 28, ANANTAPUR., ANDHRA PRADESH - 515001.